
సాక్షి
నిర్మల్
మంగళవారం । 1 । జూలై । 2025

మేమున్నామని..

పోయే ప్రాణం నిలిపే ప్రయత్నం చేస్తారు వీరు.. అనారోగ్యంతో చెంతకు వచ్చే రోగులకు దేవుళ్లవుతారు.. మేమున్నామని భరోసా కల్పించి వ్యాధులపై నిరంతరం సమరం సాగిస్తారు. వారి ఆరోగ్యానికి భరోసా కల్పించే ఆత్మీయ నేస్తాలవుతారు. ఆపత్కాలంలో బంధువులవుతారు. సేవే పరమావధిగా భావించే వైద్యులే వీరు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా జిల్లాకు చెందిన పలువురు వైద్యులపై కథనం.. 8లో



గరిష్టం/కనిష్టం
29.0 /24.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

సామాన్యులకు పోలీసులు అండగా ఉండాలి



బాధితుడి సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: సామాన్యులకు అండగా ఉండాలని ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలు తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

రిటైర్డ్ ఎస్సైకి సన్మానం
భైంసా టౌన్ ఎస్సైగా పని చేసి రిటైర్డయినా ఎండీ గౌస్‌ను జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు ఉపేంద్రరెడ్డి, రాజేశ్‌మీనా, ఏవో యూనిస్ ఆలీ, ఆర్‌ఐలు రామ్ నిరంజన్, శేఖర్, రమేశ్ ఉన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి



వడ్యాల్‌లో మాట్లాడుతున్న రాజన్న

లక్ష్మణచాంద: నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజన్న కోరారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు నెలకు రూ.26వేల కనీస వేతనం ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని కోరారు. బీడీ పరిశ్రమపై విధించిన 28శాతం జీఎస్టీ తగ్గించాలని, కోర్బా చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు గంగన్న, సాయన్న, భీమేశ్, నారాయణ, శంకర్, రమేశ్, రాజేశ్వర్, మురళి, చిన్నక్క, లక్ష్మి, రాజమణి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలి



మాట్లాడుతున్న రాజేందర్

నిర్మల్‌చైన్‌గేట్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో రాజేందర్ సిబ్బందిని కోరారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రై డే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించి దోమలు వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వ్యాధి నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో అందిస్తున్న సేవల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో కార్యక్రమ నిర్వహణాధికారి డాక్టర్ రాజారమేశ్, డాక్టర్ సౌమ్య, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి భారె రవీందర్, డీడీఎం ముత్యం, డీపీవో రామచందర్, పీహెచ్ఎన్‌వో విమల పాల్గొన్నారు.

తనిఖీలకు కమిటీలు

- పక్కాగా సర్కారు స్కూళ్ల పర్యవేక్షణ
- ప్రత్యేక బృందాల భర్తీకి ఉత్తర్వులు
- బోధన పర్యవేక్షణకు మరో వ్యవస్థ
- అభ్యంతరం తెలుపుతున్న సంఘాలు



నిర్మల్‌ఖిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనాభ్యసన ప్రక్రియ తీరును పర్యవేక్షించేందుకు మరో కొత్త వ్యవస్థ ఏర్పాటుకు పాఠశాల విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈమేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి, నోడల్ అధికారులు, డీఈవోలు, అకాడమిక్ మానిటరింగ్ అధికారులు, సెక్టోరియల్ అధికారులు వివిధ స్థాయిల్లో పర్యవేక్షణ విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ విద్యాశాఖ పాఠశాలలవారీగా బోధన తీరు, విద్యార్థుల సామర్థ్యాలు పరీక్షించేందుకు ఉపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటు చేయనుంది.

పర్యవేక్షణ బృందాల విధులు
విద్యాశాఖ తాజాగా నియమించనున్న తనిఖీ కమిటీ సభ్యులు తమ పరిధిలో పాఠశాలలను పరిశీలిస్తారు. బోధనాభ్యసన ప్రక్రియ తీరు, మౌలిక వసతులు, సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం, విద్యావిషయాక అంశాల అమలు, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు తదితర విద్యా సంబంధిత కార్యక్రమాలను పర్యవేక్షిస్తారు. తనిఖీల్లో గుర్తించిన వివరాల ఆధారంగా నివేదికలు రూపొందించి ప్రతినెలా జిల్లా విద్యాశాఖ అధికారులకు అందిస్తారు. వీటిపై కలెక్టర్ సమీక్షించి నిర్ణయాలు తీసుకుంటారు.

ఇవీ.. మార్గదర్శకాలు
విద్య నాణ్యత పెంపునకు పాఠశాలలపై పర్యవేక్షణ బలపరచాలి. తనిఖీకి రెండు శాతం ఉపాధ్యాయులతో పర్యవేక్షణ కమిటీలను నియమించాలి. ఉపాధ్యాయులకు కనీసం పదేళ్ల అనుభవం ఉండాలి. శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం తప్పనిసరి. శిక్షణ, టెక్నాలజీపై సరైన పరిజ్ఞానం అవసరం. శిక్షణ ఫలితాలపై దృష్టి, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలి. పాఠశాలల్లో పాఠ్యాంశాలు, లెసన్ ప్లాన్‌ల పరిశీలన, గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, సహపాఠ్య కార్యకలాపాలు, స్పోర్ట్స్, డిజిటల్ ఎడ్యుకేషన్, ఆరోగ్య తనిఖీలు, టాయిలెట్లు, తాగునీరు, ప్రహరీ , విద్యుత్, ఆడిటోరియం, ఆటస్థలం పరిశీలన, విద్యార్థులకు యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ పరిస్థితి, ఫలితాలు, పాఠ్య ప్రణాళికల అమలుపై పరిశీలన చేయాలి.

టీచర్స్ యూనియన్ల అభ్యంతరం
పాఠశాలల పర్యవేక్షణ తనిఖీల కోసం ఇప్పటికే అనేక రకాల వ్యవస్థలు ఉండగా మళ్లీ ఉపాధ్యాయులతో కొత్త కమిటీలు నియమించే అంశంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంప్లెక్స్, మండల నోడల్ అధికారులు, మండల విద్యాధికారి, అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్, సెక్టోరియల్ అధికారులు లాంటి అనేక వ్యవస్థలు కొనసాగుతుండగా వీటికి సమాంతరంగా మరో కొత్త తనిఖీ వ్యవస్థ ఏర్పాటుపై అభ్యంతరం చెబుతున్నారు. ఉపాధ్యాయులను తనిఖీ కమిటీలోకి తీసుకుంటే విద్యార్థులకు నష్టం చేకూరుతుందని, ఉపాధ్యాయుల కొరత ఏర్పడుతుందని పేర్కొంటున్నారు. వెంటనే పర్యవేక్షణ కమిటీ నియామక ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని పాఠశాలలు, క్లస్టర్ల వివరాలు

జిల్లా	ప్రాథమిక	ప్రాథమికోన్నత	ఉన్నత	మొత్తం	మండలాలు	క్లస్టర్లు
నిర్మల్	488	83	118	689	19	48
ఆదిలాబాద్	455	102	109	666	21	71
మంచిర్యాల	480	95	108	683	18	51
కుమురంభీం	526	99	60	685	15	67

ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలి



ఇప్పటికే పలు రకాల పర్యవేక్షణ వ్యవస్థలు కొనసాగుతున్నాయి. మళ్లీ తనిఖీ అధికారుల నియామకం అవసరంలేదు. ఉపాధ్యాయుల ద్వారా ఏర్పడిన పర్యవేక్షణ కమిటీలతో కొత్తగా ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు. దీంతో ఉపాధ్యాయుల కొరత, కేడర్ సమస్యలు వస్తాయి.
– ఎస్.భూమన్నయాదవ్, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

ప్రస్తుత వ్యవస్థను పటిష్టం చేయాలి



ప్రస్తుతం కాంప్లెక్స్ హెచ్ఎం, ఎంఈవో, ఎస్వో, ఏఎంవో, డీఈవోలు పర్యవేక్షణ అధికారులుగా పనిచేస్తున్నారు. ఇందులోని ఖాళీలను పూర్తిస్థాయిలో భర్తీ చేసి వ్యవస్థను బలోపేతం చేయాలి. కమిటీల ఏర్పాటు నిర్ణయాన్ని పునరాలోచించాలి. మా సంఘం తరఫున ప్రభుత్వాన్ని కోరుతాం.
– తోట నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

ఆసరా.. ఏదయా?



చిత్రంలో కనిపిస్తున్న వృద్ధుడి పేరు చవాన్ సోమల. కుభీర్ మండలం కసర గ్రామానికి చెందిన సోమల ఉమ్మడి రాష్ట్రంలో రూ.200 పింఛన్ తీసుకున్నాడు. రాష్ట్ర విభజన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇంట్లో ఒకరికే పెన్షన్ విధానం తెచ్చింది. దీంతో సోమల పెన్షన్ కట్‌చేసి ఆయన భార్య తిత్రీబాయికి వితంతు పెన్షన్ రూ.2 వేలు మంజూరు చేసింది. సోమల బతికి ఉండగానే వితంతు పింఛన్ మంజూరు చేశారు. రెండేళ్ల క్రితం తిత్రీబాయి మరణించింది. ఆమె తర్వాత తనకు వద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని సోమల అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నాడు. కానీ, ఆన్‌లైన్‌లో అతను చనిపోయినట్లు నమోదైంది.

- ఉన్నవి పెరగవు.. కొత్తవి రావు!
- ఏళ్లుగా పింఛన్ కోసం అర్హుల నిరీక్షణ
- ఆసరా కోసం పండుటాకులు, దివ్యాంగుల బాధ వర్ణనాతీతం

నిర్మల్‌చైన్‌గేట్: అడుగుతీసి అడుగేసే సత్తువ లేని వృద్ధులు, స్వంతంగా నడవలేని దివ్యాంగులు, ఇంటి పెద్దను కోల్పోయిన ఒంటరి మహిళలు.. వీరంతా ప్రభుత్వ 'ఆసరా' కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. కానీ, మూడేళ్లుగా కొత్త పెన్షన్ల మంజూరు కావడం లేదు. అయినా ఆశతో ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి, దరఖాస్తులు అందించినా, వారి గోడు వినిపించుకునే వారు కరువయ్యారు.

మూడేళ్లుగా పెండింగ్‌లో..
ప్రభుత్వం దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, ఎంపిక చేసిన వర్గాలకు అందించే 'ఆసరా' పెన్షన్ మూడేళ్లుగా కొత్తవారికి మంజూరు కావడం లేదు. 2022 ఆగస్టు తర్వాత కొత్త పెన్షన్ల మంజూరు పూర్తిగా నిలిచిపోయింది. అప్పటివరకు పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను మాత్రమే పరిశీలించి అర్హులకు పెన్షన్లు ఇచ్చారు. మిగతా వాటిని పట్టించుకోలేదు. దీంతో, ఎక్కడ ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే సమాచారం కూడా అందుబాటులో లేకుండా పోయింది.

ప్రజావాణిలో వినతులు..
ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో పెన్షన్ కోసం వందలాది వినతులు అందుతున్నాయి. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన 'ప్రజాపాలన' వేదికలోనూ పింఛన్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు స్వీకరించారు. కానీ, వీటి డాటా ఎంట్రీ కూడా సక్రమంగా జరగలేదనే ఆరోపణలున్నాయి. కాగా, పెన్షన్ మొత్తం పెంచుతామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం, తమకు పాత లెక్కనైనా పెన్షన్ అందించి ఆదుకోవాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు.

పెండింగ్‌లో 3,320 దరఖాస్తులు
జిల్లాలో 18 మండలాలు, 3 మున్సిపాలిటీల పరిధిలో 3,320 మందికి పైగా వివిధ కేటగిరీల కింద పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరంతా అధికారుల విచారణలో అర్హులుగా గుర్తించబడ్డారు. ప్రభుత్వానికి సిఫార్సు చేయబడినవారు కూడా. అయినా ఈ దరఖాస్తులపై ఎలాంటి చర్యలూ లేవు. ఇంకా, పరిశీలన పూర్తి కాని దరఖాస్తులు జిల్లా, మండల స్థాయిలో భారీ సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. పెన్షన్లు ఎప్పుడు మంజూరవుతాయనే సమాచారం జిల్లా అధికారుల వద్ద కూడా లేదు.

హామీలు గాలికి..
గత బీఆర్ఎస్ ప్రభుత్వం దివ్యాంగులకు రూ.4 వేలు, వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులకు రూ.2 వేల పెన్షన్ అందించేది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు దివ్యాంగులకు రూ.6,016, ఇతరులకు రూ.4,016 ఇస్తామని ప్రకటించింది. డిసెంబర్ నుంచి ఈ పెంచిన పెన్షన్లు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు గడిచినా పింఛన్లు పెరగలేదు. కొత్తగా ఒక్కరికి కూడా పింఛన్ మంజూరు చేయలేదు.

రంజనిలో ఎర్రచందనం సాగు

- పంట కాలపరిమితి పదిహేనేళ్లు
- అంతర పంటల సాగుకు అవకాశం
- లాభసాటి అంటున్న అధికారులు

కుభీర్: మండలంలోని రంజని గ్రామానికి చెందిన సట్లావార్ మహేందర్ మిగతా రైతుల కంటే భిన్నంగా ఆలోచించాడు. ఉద్యానవన, ఉపాధిహామీ అధికారుల సూచనలు, సలహాలతో ఎకరన్నరలో ఎర్రచందనం సాగు చేశాడు. ములుగు జిల్లా నుంచి తెచ్చిన 500 ఎర్రచందనం మొక్కలను 10 ఫీట్ల పొడవు, వెడల్పుతో నాటాడు. మధ్యలో అంతరపంటగా సరుగు మొక్కలు కూడా నాటి సంరక్షిస్తున్నాడు. ఎర్రచందనం పంట కాలపరిమితి 15 ఏళ్లు కాగా మొక్కలు నాటి ఐదేళ్లవుతోంది. మరో పదేళ్లలో పంట చేతికి రానున్నట్లు రైతు మహేందర్ తెలిపాడు.

సాగు విధానం ఇలా..
రెండు ఫీట్ల గోతిలో పశువుల ఎరువు, ఇతర సేంద్రియ ఎరువు వేసి మొక్కలు నాటాలి. ప్రతీ ఆర్నెళ్లకోసారి సేంద్రియ ఎరువు వేయాలి. కలుపు ఎక్కువైతే గడ్డి మందు పిచికారి చేయాలి. వారానికోసారి నీటి తడులు ఇవ్వాలి. ఎర్రచందనం పరాన్న మొక్క కావడంతో మధ్యలో సరుగు మొక్కలు నాటాలి. దీంతో సరుగు మొక్కల వేర్ల నుంచి ఎర్రచందనం మొక్క ఆహారం తీసుకుంటుంది. దీనికి పూత వచ్చి కాయలు కూడా కాస్తాయి. చీడపీడలు ఏమీ ఉండవు. చెట్టు కాండానికి రంధ్రం ఏర్పడుతుంది. అప్పుడు క్లోరిఫైయిడ్ మందును ఇంజక్షన్ ద్వారా రంధ్రంలో వేయాలి. ఈ పంటలో అంతరపంటగా కంది, పసుపు తదితర పంటలు కూడా సాగు చేసుకోవచ్చు.



మహేందర్ సాగు చేస్తున్న ఎర్రచందనం

ఇవీ.. ఉపయోగాలు
ఎర్రచందనాన్ని సబ్బులు, ఆయుర్వేద మందుల తయారీకి ఉపయోగిస్తారు. రక్తం శుద్ధి కావడానికి, కిడ్నీ సంబంధిత వ్యాధులను నయం చేసుకోవడానికి దీని ద్వారా తయారైన మందులు ఉపయోగిస్తారు. రష్యా, చైనాలో దీని కలపతో తయారైన వంటపాత్రలు వాడతారు. ఒక్కో చెట్టునుంచి సుమారు 15 నుంచి 20కిలోల ఎర్ర చందనం దుంగలు వస్తాయి. కిలో ఎర్రచందనం విలువ రూ.10వేల నుంచి రూ.12 వేల వరకు ఉంటుంది. ఏపీలోని రాయలసీమ, నల్లమల అడవుల్లో ఉండే ఈ చెట్లను ఇక్కడి రైతులు సాగు చేసేలా ఉద్యానవనశాఖ అధికారులు ప్రోత్సహిస్తున్నారు. నర్సరీల్లో ఎర్రచందనం మొక్కలు పెంచి రైతులు సాగు చేసేలా చూస్తున్నారు. 15 ఏళ్ల తర్వాత ఒక్కో చెట్టుద్వారా రూ.లక్షన్నర నుంచి రూ.2లక్షల వరకు ఆదాయం వస్తుంది. లాభసాటిగా మారిన ఎర్రచందనం సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహం లేదు



నేను ఐదేళ్ల క్రితం ఎకరన్నరలోఎర్రచందనం మొక్కలు నాటాను. ప్రారంభంలో ఉద్యానవనశాఖ, ఉపాధిహామీ అధికారులు వచ్చి చూశారు. కానీ.. ఇప్పటివరకు నయాపైసా రాలేదు. ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింతమంది రైతులు సాగు చేసేందుకు ముందుకువస్తారు.
– సట్ల మహేందర్, రైతు, రంజిని

ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్
- ప్రజావాణికి 105 అర్జీలు

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణికి వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై తక్షణమే స్పందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించి ప్రజల నుంచి 105 అర్జీలు స్వీకరించారు. ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగమిప్పించాలి



నేను 2024 డీఎస్సీలో పరీక్ష రాసి ఉత్తీర్ణుడనయ్యాను. తాండూరు మండలానికి చెందిన పాటిల్ అంబాదాస్ సంభాజీ ఐదోతరగతి నుంచి మహారాష్ట్రలో చదివాడు. 2012, 2018 డీఎస్సీలో అతడిని టీఎస్పీఎస్సీ నాన్ లోకల్ క్యాండెట్‌గా తిరస్కరించింది. కానీ, 2024 డీఎస్సీలో లోకల్ క్యాండెట్‌గా పరిగణించి నాకు రావాల్సిన ఉద్యోగం అతడికిచ్చారు. విచారణ చేపట్టి నాకు ఉద్యోగమిప్పించాలి.
– బీ నాగనాథ్, జవ్లా బీ, తానూరు

విద్యుత్ కనెక్షన్ ఇవ్వాలి



కలెక్టర్ కార్యాలయం నుంచి రెడ్డి ఫంక్షన్ హాల్ చౌరస్తా వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో వివిధ పనుల రీత్యా నిర్మల్ పట్టణానికి వెళ్లే మహాలక్ష్మివాడ, డబుల్ బెడ్రూం, నాగనాయిపేట కాలనీవాసులం రాత్రిపూట ప్రమాదాలకు గురవుతున్నాం. వెంటనే సెంట్రల్ లైటింగ్‌కు విద్యుత్ కనెక్షన్ ఇప్పించి సమస్య పరిష్కరించాలి.
– నవీన్, మహాలక్ష్మివాడ

వినతుల్లో మరికొన్ని..

- ప్యాకేజీ 27లో గొల్లమడ గ్రామం మీదుగా 5.3 కిలో మీటర్ల మేర డ్రైన్ బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టగా గ్రామానికి చెందిన దాదాపు పదిన్నర ఎకరాల భూమి కోల్పోవాల్సి వచ్చిందని గొల్లమాడ రైతులు తెలిపారు. బ్రిడ్జి నిర్మించి ఏడాదైనా పరిహారం అందలేదని పేర్కొన్నారు. వెంటనే పరిహారం ఇప్పించాలని కోరారు.
- బేస్తవార్‌పేట కాలనీలోని రోడ్డు గుంతలు పడి అధ్వానంగా తయారై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు తెలిపారు. మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.
- తమ గ్రామంలోని 249 సర్వే నంబర్ లోగల ఎకరం భూమి చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణానికి కేటాయించాలని ముధోల్ మండలం బోరిగం గ్రామ రజకులు కలెక్టర్‌ను కోరారు.
- రాష్ట్ర ప్రభుత్వం 2025 మే 30న తడోబా అందేరి రిజర్వ్ ఫారెస్ట్‌ను కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో కలుపుతూ కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్–ఆసిఫాబాద్ పరిధిలో 334 గ్రామాలను గజిట్‌లో పేర్కొంటూ తీసుకువచ్చిన జీవో 49ని, కుమురంభీం కన్జర్వేషన్ రిజర్వ్ ప్రాజెక్ట్‌ను రద్దు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం సభ్యులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.
- అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ నుంచి పెండింగ్ వేతనాలు ఇప్పించాలని జిల్లా ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటళ్లలో పని చేసే ఆరోగ్య మిత్రలు కోరారు. ఏజెన్సీ కాలపరిమితి పెంచి తాము ఉపాధి కోల్పోకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు.

గోదావరిలో మట్టి కుప్పలు

- బాసర వద్ద తరచూ ప్రమాదాలు
- తొలగించాలని కోరుతున్న భక్తులు



బాసరలో స్నానఘట్టాలపై మట్టి కుప్పలు

భైంసా: బాసర గోదావరినది స్నాన ఘట్టాలపై మట్టి పేరుకుపోతోంది. ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో పుణ్యస్నానాల కోసం వచ్చే భక్తులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బాసర వద్ద గోదావరిపై రెండు కొత్త వంతెనలు నిర్మిస్తుండగా ఇందుకోసం నదిలో నల్లమట్టితో తాత్కాలిక రోడ్లు వేశారు. నీటి ప్రవాహం పెరిగినప్పుడల్లా తాత్కాలిక రోడ్ల మట్టితోపాటు పిల్లర్ల కోసం తీసిన గుంతల్లోని మట్టి కూడా దిగువకు కొట్టుకువచ్చి స్నానఘట్టాల వద్ద పేరుకుపోతోంది. రెండేళ్లుగా ఇదే పరిస్థితి ఉంటోంది. గోదావరినదిలో వివిధ రూపాల్లో కొట్టుకువచ్చిన మట్టి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేరి అందులో పూడిక పెరుగుతోంది. నదిలో వేస్తున్న వ్యర్థాలు, నల్లమట్టి, బండరాళ్లు కొట్టుకువచ్చి ఎస్సారెస్పీలో పూడికకు కారణమవుతున్నాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నీటి సామర్థ్యం 90 టీఎంసీలు కాగా, పూడిక కారణంగా 80 టీఎంసీలకు పడిపోయింది. మంగళవారం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తుతున్నారు. ప్రాజెక్ట్‌లోని నీరు గోదావరిలో చేరి ప్రవాహం మరింత పెరగనున్నందున వంతెనల వద్ద తాత్కాలిక రోడ్ల కోసం వేసిన నల్లమట్టి మరింత కొట్టుకువచ్చి బాసర గోదావరి స్నానఘట్టాలను ముంచెత్తనుంది. ఇప్పటికైనా అధికారులు నదిలో మట్టి, చెత్తాచెదారం వేయకుండా చర్యలు చేపట్టాలని, బాసర గోదావరినది స్నానఘట్టాల వద్ద ఉన్న మట్టి కుప్పలు తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలి



శాంతి దీక్షలో తెలంగాణ ఉద్యమకారులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ ఉద్యమకారుల డిమాండ్లు నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చైర్మన్ కొట్టె శేఖర్ కోరారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ పిలుపు మేరకు సోమవారం పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద శాంతి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లు ఒక కమిషన్ వేసి ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ చేపట్టాలని కోరారు. ప్రతీ ఉద్యమకారునికి 25 చదరపు గజాల స్థలం, గృహ నిర్మాణానికి రూ.10 లక్షల సాయం, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ రాయితీ, రూ.25వేల పెన్షన్, ఉద్యమంలో సర్వం కోల్పోయిన విద్యార్థి ఉద్యమకారులకు ఉద్యోగాల్లో 20శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను నెరవేర్చడంలో ప్రభుత్వం చేస్తున్న కాలయాపనను నిరసిస్తూ జూలై 2నుంచి సెప్టెంబర్ 17వరకు ఫోరం ఉద్యమ కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా శాంతిదీక్ష చేపట్టినట్లు పేర్కొన్నారు. ఫోరం నాయకులు సామ కిరణ్‌రెడ్డి, పాకాల రాంచందర్, సామల వీరయ్య, వెంకట్‌రామ్ రెడ్డి, నర్సయ్య, గోపి, గంగన్న, ఇస్మాయిల్, శివాజీ, దేవిదాస్, వినోద్, జగన్, షరీఫ్, సాయన్న, చంద్రశేఖర్, భూమేశ్, శంకర్, విద్యాసాగర్‌రెడ్డి, కిషన్, నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎస్బీఐ సేవా కార్యక్రమాలు

నిర్మల్‌చైన్‌గేట్: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్థాపించి 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లాలోని 19శాఖల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, అనాథాశ్రమాలకు అవసరమైన సామగ్రి పంపిణీ, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పేద రోగులకు అవసరమైన సామగ్రి అందజేయనున్నట్లు వివరించారు.

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

తానూరు : మండల కేంద్రంలోని జాదవ్ వెంకటేశ్‌కు చెందిన (పల్సర్) ద్విచక్ర వాహనం చోరీకి గురైనట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి వెంకటేశ్ తన ఇంటిముందు నిలిపి ఉంచాడు. ఆదివారం ఉదయం చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి


లక్ష్మి (ఫైల్)

తలమడుగు: విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తలమడుగు మండలంలోని కజ్జర్ల గ్రామానికి చెందిన జువ్వాక లక్ష్మి (48) ఆదివారం రాత్రి ఇంట్లోకి సరఫరా అయ్యే విద్యుత్ తీగపై ఆరేసిన బట్టలు తీస్తుండగా షాక్‌కు గురికావడంతో కిందపడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాధిక తెలిపారు. మృతురాలికి భర్త పోచ్చన్న, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రాయితీ బియ్యం పట్టివేత


పట్టుబడిన రాయితీ సన్నబియ్యం

నార్నూర్: రాయితీ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి పేదలకు అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పీ.ప్రభాకర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సోమవారం గాదిగూడ మండల కేంద్రంలో దాడులు నిర్వహించగా కూర శివాజీ దుకాణంలో 17.6 క్వింటాళ్లు, లోకారి–కే గ్రామంలో షేక్ జావిద్ కిరాణా దుకాణంలో 7.3 క్వింటళ్ల ప్రభుత్వ రాయితీ బియ్యం లభించినట్లు పేర్కొన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు తెలిపారు.

మేమున్నామని..

నిర్మల్‌చైన్‌గేట్: వైద్యో నారాయణో హరి అంటారు.. వైద్యుడు దేవుడితో సమానమని అర్థం. దేవుడు జన్మనిస్తే.. డాక్టర్ పునర్జన్మనిస్తాడు. కనిపించే దేవుడు.. రోగికి ప్రాణం పోసే ప్రాణదాత డాక్టర్. నాడి పట్టి.. గుండె గుబులును దూరం చేసేది వైద్యుడే. ప్రముఖ వైద్యుడు, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి బిధన్ చంద్రరామ్ పుట్టిన రోజున జాతీయ డాక్టర్స్ డే జరుపుకుంటున్నారు. 1882 జూలై 1న జన్మించిన రాయ్ కలకత్తా మెడికల్ కళాశాలలో వైద్యడిగ్రీ పొందారు. లండన్‌లో ఉన్నత విద్యనభ్యసించి 1911లో స్వదేశానికి వచ్చి వైద్య సేవలు ప్రారంభించారు. కోల్‌కతా మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. గాంధీజీతో కలిసి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. వైద్యవృత్తిలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం 1961లో భారత రత్న అవార్డుతో సత్కరించింది. 1962 జూలై1న కన్నుమూశారు. బిధన్ చంద్ర రామ్ జయంతిని డాక్టర్స్‌డేగా జరుపుకోవాలని 1961లో ప్రభుత్వం నిర్ణయించింది. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వృత్తినే దైవంగా భావిస్తూ.. రోగులకు మేమున్నామని ధైర్యం చెబుతున్న వైద్యులపై ప్రత్యేక కథనం..



- ప్రాణదాతలుగా నిలుస్తూ.. పునర్జన్మనిస్తూ..
- రోగుల సేవలో తరిస్తున్న వైద్యులు
- వృత్తికే వన్నె తెస్తున్న ఆపద్బాంధవులు
- నేడు జాతీయ వైద్యుల దినోత్సవం

25 ఏళ్ల అనుభవం..



1995లో గాంధీ యూనివర్సిటీలో ఎంబీబీఎస్, 1998లో ఎండీ, పిడియాట్రీషన్ పూర్తిచేశా. మూడేళ్లపాటు నిజామాబాద్‌లో పిల్లల వైద్యునిగా పనిచేశా. 2012లో నిజామాబాద్ జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరైనప్పటి నుంచి వివిధ హోదాలలో సేవలు అందించా. గతేడాది నుంచి నిర్మల్ మెడికల్ కళాశాల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టా. ఈ 25 ఏళ్ల అనుభవంలో ఎంతో మందికి సేవలు అందించా. పేదలకు సేవ చేయడం గొప్పగా భావిస్తున్నా.

– డాక్టర్ గోపాల్‌సింగ్, సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆసుపత్రి, నిర్మల్

వైద్యసేవలు అందించాలనే..



పేదలకు వైద్యసేవలు అందించాలనే వైద్యవృత్తిని ఎంచుకున్నా. 25 ఏళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నా. ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమయ్యే వసతులు, వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నా. 24 గంటలపాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నా. వైద్యవృత్తి సేవా దృక్పథంతో ముడిపడి ఉంటుంది. డబ్బుల కోసమే కాకుండా స్వచ్ఛందంగా వైద్య సేవలందించాలి.

– డాక్టర్ కాశీనాథ్, సూపరింటెండెంట్, భైంసా ఏరియా ఆసుపత్రి

జీవితం పేదల కోసమే..



ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నా. పేదలకు సేవ చేయడానికి జీవితాన్ని అంకితం చేశా. నిత్యం రోగులకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నా. నిత్యం 300 నుంచి 400 మంది ఆయా సేవల నిమిత్తం వస్తుంటారు. చివరి పేషెంట్ వరకు ఏరోజుకు ఆరోజు స్కానింగ్ చేయడంతో పాటు రిపోర్టులు తయారు చేసి రోగులు ఇబ్బందులు పడకుండా చూస్తాం. సేవలకు గుర్తింపుగా కలెక్టర్, మంత్రుల చేతుల మీదుగా పలుమార్లు అవార్డులు అందుకున్నా.

– నూతుల కళ్యాణ్‌రెడ్డి, ప్రొఫెసర్, రిమ్స్

ప్రజలకు సేవ చేయాలని..



ఆదిలాబాద్‌టౌన్: వరంగల్‌లోని కేఎంసీలో వైద్య విద్య అభ్యసించా. ఢిల్లీలో పీజీ పూర్తి చేశా. అక్కడే అంబేడ్కర్ ఆస్పత్రిలో వైద్యసేవలు అందించా. జిల్లా ప్రజలకు వైద్యసేవలు అందించాలని తండ్రి శ్రీరాములు కోరిక మేరకు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో వైద్యునిగా చేరారు. నాలుగేళ్లగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలు అందిస్తున్నా. 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటున్నా.

– డాక్టర్ ఆడె విఠల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, రిమ్స్

నమ్మకమైన సేవలు అందించాలి



అమ్మానాన్నల ప్రోత్సాహంతో వైద్య కోర్సు పూర్తిచేశా. వైద్యోనారాయణోహరి అనే నానుడిని నేడు కార్పొరేట్ ఆస్పత్రులు పూర్తిగా డబ్బులకు ఆశపడి మరిచిపోతున్నాయి. వైద్యులు రోగులకు నమ్మకమైన సేవలందించాలి. వైద్యరంగంలో రాణించాలనుకునే యువత ముందుగా ఎథికల్ ప్రాక్టీస్ చేయాలి. వైద్యులు ముఖ్యంగా మాతాశిశు మరణాలు జరగకుండా ఆపగలిగితే మనదేశం అభివృద్ధిలో మరింత ముందుంటుంది.

– డాక్టర్ ప్రత్యూష, లక్ష్మణచాంద పీహెచ్‌సీ

వృత్తిలో తృప్తి



రోగులకు వైద్యసేవలు అందించడం అదృష్టంగా భావిస్తున్నా. ఇష్టంగా ఎంచుకున్న వృత్తిలో విజయాలు సాధించినప్పుడు కలిగే ఆనందం గొప్పది. గ్రామీణ ప్రజలకు సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం కడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు పెంబి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా విధులు నిర్వహిస్తున్నా. వైద్య వృత్తిలో తృప్తి లభిస్తోంది.

– శివకుమార్, కడెం పీహెచ్‌సీ

బీసీరాయ్ ఆదర్శం..



వైద్యవృత్తి ఎంతో గౌరవప్రదమైనది. ప్రతీ ఉద్యోగికీ ఉద్యోగ విరమణ ఉంటుంది. కానీ వైద్యుడికి మాత్రం ఉండదు. తాను చనిపోయేంత వరకు వైద్యం అందిస్తూనే ఉంటారు. ప్రతీ వైద్యుడు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి. డాక్టర్ బీసీ రాయ్‌ని ఆదర్శంగా తీసుకుని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేదలకు వైద్యసేవలు అందిస్తున్నా.

– అశ్వీర్‌రెడ్డి, మత్తు వైద్యనిపుణులు, నర్సాపూర్(జి) సీహెచ్‌సీ

18 ఏళ్లుగా సేవలు..



చెన్నూర్: పద్దెనిమిదేళ్లుగా చెన్నూర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందిస్తున్నా. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. రోగులకు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యసేవలు అందిస్తున్నా. రోగులకు అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఇప్పటి వరకు పలు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నా. రాబోయే రోజుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తా.

– సత్యనారాయణ, చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు

సమాజ సేవలో చంద్రదత్



మంచిర్యాలటౌన్: మంచిర్యాలకు చెందిన వైద్యుడు జీవీఎంఎస్ చంద్రదత్ ఐబీ సమీపంలో ప్రైవేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. తరచూ ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి మందులు సైతం అందిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఆస్పత్రికి వచ్చే రోగుల ఆర్థిక పరిస్థితినిబట్టి ఫీజులు తీసుకుంటున్నారు. అనవసరమైన టెస్టులు చేయకపోవడం, అవసరానికి మించి మందులు రాయడం వంటివి లేకపోవడంతో ప్రజలు నమ్మకంగా వస్తున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ, వృద్ధాశ్రమంలో ఉచితంగా వైద్య శిబిరం నిర్వహించి మందులు సైతం ఉచితంగా అందిస్తున్నారు. ఆశ్రమాలకు అవసరమైన సరుకులు, నగదు అందజేస్తున్నారు.

– డాక్టర్ చంద్రదత్, జనరల్ మెడిసిన్

ఆర్జీయూకేటీలో అకడమిక్ రివ్యూ మీటింగ్


మాట్లాడుతున్న ప్రొఫెసర్ గోవర్ధన్

బాసర: బాసర ఆర్జీయూకేటీలో 2025–26 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం అకడమిక్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీసీ ప్రొఫెసర్ ఏ.గోవర్ధన్, ఓఎస్‌డి ప్రొఫెసర్ ఈ. మురళీదర్శన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్యార్థుల హాజరు, రిజిస్టర్ల నిర్వహణ, డేటా భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎన్‌ఏఏసీ ఫైల్ తయారీపై అన్ని శాఖల అధ్యాపకులు శ్రద్ధ వహించాలని సూచించారు. త్వరలో (ఎంటెక్)పీహెచ్‌డీ ప్రవేశ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. బాసర, మహబూబ్ నగర్ సెంటర్లకు సంబంధించిన ప్రవేశ ఫలితాలు విడుదల జూలై 4న, జూలై 7, 8, 9 తేదీల్లో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ ఫలితాలను మొదటిగా విడుదల చేసిన విశ్వవిద్యాలయంగా బాసర ఆర్జీయూకేటీ నిలిచిందన్నారు. ఇందులో భాగమైన టీచింగ్ నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీన్లు డాక్టర్ మహేష్, డాక్టర్ విట్టల్, డాక్టర్ నాగరాజు, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు, పీఆర్‌వో విజయ్ కుమార్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సఫారీకి సెలవు

- జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేత
- అక్టోబర్ నుంచి పునఃప్రారంభం


జంగిల్ సఫారీ

జన్నారం: కవ్వాల్ అభయారణ్యంలోని జన్నారం అటవీ డివిజన్‌లో జంగల్ సఫారీకి అటవీశాఖ మూడు నెలలపాటు సెలవు ప్రకటించింది. జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు నిలిపివేస్తున్నట్లు అటవీశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. పచ్చదనం పంచుతున్న అడవి అందాలను తిలకించేందుకు పర్యాటకశాఖ జన్నారంలో హరిత రిసార్ట్‌లు ఏర్పాటు చేయగా పర్యాటకశాఖ రెండు సఫారీలు, అటవీశాఖ ఐదు సఫారీలు ఏర్పాటు చేశారు. జన్నారం వచ్చిన పర్యాటకులు సఫారీ ద్వారా దట్టమైన అడవిలోనికి వెళ్లి పచ్చని చెట్ల నడుమ పర్యటించడం వల్ల ఆహ్లాదం పొందుతున్నారు. అడవుల అందాలను, వన్యప్రాణుల పరుగులను చూసేందుకు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు.

మూడు నెలలపాటు నిలిపివేత

అడవుల అందాలను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు మూడు నెలల పాటు సఫారీ ప్రయాణానికి అనుమతి లేదు. ఎందుకంటే వర్షాకాలంలో వన్యప్రాణులు ఎదకు వచ్చి బయట విచ్చలవిడిగా తిరుగుతాయి. సఫారీ ప్రయాణంతో వాటికి ఆటంకం కలుగుతుంది. వన్యప్రాణుల స్వేచ్ఛకు భంగం కలిగించవద్దనే ఉద్దేశంతో మూడు నెలలు (జూలై 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు) అనుమతులు నిరాకరిస్తూ అటవీశాఖ అధికారులు పర్యాటకశాఖకు ఉత్తర్వులు జారీ చేశారు.

మూణ్నెళ్లు బంద్‌చేస్తాం

ఎన్‌టీసీఏ సూచనల ప్రకారం ప్రతి సంవత్సరం వర్షాకాలంలో మూడు నెలలపాటు సఫారీ ప్రయాణం బంద్ చేయడం జరుగుతోంది. వర్షాల కారణంగా అడవిలో బురదలో వాహనాలు కూరుకుపోయి ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. అక్టోబర్‌లో తిరిగి అనుమతులు ఇస్తాం. పర్యాటకులు గమనించాలి.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో

వలకు చిక్కిన భారీ చేప


బొచ్చె చేపతో మత్స్యకారుడు ముత్యం

కడెం: కడెం ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడి వలకు భారీ బొచ్చె చేప చిక్కింది. పెద్దూరుకు చెందిన మత్స్యకారుడు ముత్యం సోమవారం ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లాడు. చేపలు పడుతుండగా వలలో 32 కేజీల బొచ్చె చిక్కడంతో హర్షం వ్యక్తం చేశాడు.

బైక్‌ల దొంగ అరెస్ట్


నిందితుడితో సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనం దొంగలించిన ఆదిలా బాద్ పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన షేక్ నదీమ్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మహ్మద్ షాబాద్‌ఖాన్ ఏప్రిల్ 11న బస్టాండ్‌లో పల్సర్ బైక్ పార్కింగ్ చేసి నిర్మల్‌కు వెళ్లాడు. రాత్రి 9 గంటలకు తిరిగి వచ్చిన ఆయన బైక్ కనిపించకపోవడంతో 15న టూటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం ఇందిరానగర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా నిందితుడు అటువైపు నుంచి బైక్‌పై వస్తుండగా అనుమానం వచ్చి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. విచారించగా రెండు బైక్‌లు చోరీ చేసినట్లు తెలిపాడు. నిందితుడిపై ఇదివరకే రూరల్ పోలీసు స్టేషన్‌లో 2, టూటౌన్ పోలీసు స్టేషన్‌లో 2 చోరీ కేసులు ఉన్నట్లు చెప్పారు.

చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్‌రావు

ఆదిలాబాద్‌టౌన్: మత్తు పదార్థాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. సోమవారం టూటౌన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గుర్ని విచారించగా చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. శనివారం రాత్రి రిమ్స్ ఆస్పత్రి పక్కన గల సాయిసేవ ఆస్పత్రిలోని మెడికల్ షాపులో చోరీకి పాల్పడ్డారని, ఒక సెల్ ఫోన్‌తో పాటు రూ.200 నగదు, టర్మైన్ ఇంజక్షన్లు, మెడజాలమ్ ఇంజెక్షన్లను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. మత్తుపదార్థాలకు అలవాటుపడిన వారు మత్తులో ఉండటానికి ఇలాంటి ఇంజక్షన్ల చోరీకి పాల్పడినట్లు వివరించారు. ఈనెల 22న మోయిజ్ మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో, 23న దస్నాపూర్‌లోని దుర్గామాత మందిరంలో, 28న సాయిఫాస్ట్‌ఫుడ్ సెంటర్ పక్కన గల కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడినట్లు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో న్యూహౌజింగ్‌బోర్డుకు చెందిన మహ్మద్ మోయిజ్, చిల్కూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ సమీర్, షేక్ అబ్దుల్ ఉన్నట్లు పేర్కొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన ముగ్గురు విలేకరుల అరెస్ట్

ఇచ్చోడ: రైతును బెదిరించి రూ.50 వేలు డిమాండ్ చేసిన ముగ్గురు విలేకరులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. సోమవారం ఇచ్చోడ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నేరడిగొండ మండలంలోని సుర్దపూర్‌కు చెందిన టాగారే కాసాన్‌దాస్ మే 18న ఇంట్లో తన కూతురు పెండ్లి ఉండటంతో జొన్నలను సమీపంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఆరబెట్టాడు. గమనించిన గాజుల దేవేందర్, షేక్ ఫసియొద్దీన్, గాజుల శ్రీకాంత్ ప్రభుత్వ పాఠశాల ఆవరణ లో జొన్నలను ఆరబెట్టడానికి అనుమతులు ఉన్నా యా అని బెదిరించి రూ.50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. భయాందోళనకు గురైన రైతు రూ.30వేలు అందించాడు. సదరు రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సదరు విలేకరుల నుంచి రూ.18 వేలు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: తాంసి మండలంలోని లీమ్‌గూడకు చెందిన టేకం భరత్ సోమవారం ఉదయం భుక్తాపూర్‌లోని విద్యుత్ కార్యాలయం ముందు నుంచి కాలినడకన వెళ్తుండగా ఆటో ఢీకొంది. దీంతో ఆయన తలకు గాయమైంది. బాధితుడి భార్య టేకం అనసూయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.